## 11న బీసీ భవన ప్రారంభోత్సవం



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిక్కాల దత్తు, శ్రీనివాస్

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 9 : ఆదిలాబాద్‌లో నూతనంగా నిర్మించిన బీసీ భవనం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఈ నెల 11వ తేదీన నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిక్కాల దత్తు, కలాల శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్‌తో పాటు జిల్లా ప్రజాప్రతినిధులు హాజరవుతారని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు అంజయ్‌కుమార్, దయాకర్, విశాల్, శ్రీనివాస్, రవీందర్, అశోక్, రమేశ్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్



మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయుడు లక్ష్మారెడ్డి

జైనథ్, ఫిబ్రవరి 9 : మాంగుర్ల గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. విద్యార్థులు వివిధ రకాల వంటకాలు తయారు చేసి ప్రదర్శించారు. కార్యక్రమానికి పాఠశాల సముదాయం మేడిగూడ(కే) ప్రధానోపాధ్యాయుడు లక్ష్మారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులకు మంచి ఆహారం ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రవీందర్ గౌడ్, ఉపాధ్యాయులు చంద్రకళ, అరుణ్, వినోద్, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రత్యేకాధికారికి సన్మానం



ఎంపీడీవో సుశీల్ రెడ్డిని సన్మానిస్తున్న ఎంపీటీసీ, గ్రామస్తులు

బోథ్, ఫిబ్రవరి 9 : దేవుల్‌నాయక్‌తండా గ్రామ పంచాయతీకి వచ్చిన ప్రత్యేకాధికారి ఎంపీడీవో సుశీల్ రెడ్డిని శుక్రవారం చింతలబోరి ఎంపీటీసీ సునీతారోహిదాస్, గ్రామస్తులు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాభివృద్ధి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఏమైన సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## హైమాస్ట్ లైట్లు ప్రారంభం



హైమాస్ట్ లైట్లు ప్రారంభిస్తున్న ఎంపీపీ నిమ్మల ప్రీతమ్‌రెడ్డి

ఇచ్చోడ, ఫిబ్రవరి 9 : గుబ్బా, మాన్కపూర్, మేడిగూడ, మల్యాల్, యాపల్‌గూడ గ్రామాల్లో ఎంపీపీ నిధులతో నిమ్మల ప్రీతమ్ రెడ్డి హైమాస్ట్ లైట్ల టవర్స్ ఏర్పాటుకు కృషి చేశారు. శుక్రవారం యాపల్‌గూడ గ్రామంలో హైమాస్ట్ లైట్ల టవర్ లైట్లు స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ జలై జాకు, ఎంపీటీసీలు నిమ్మల శివకుమార్ రెడ్డి, దేవ్‌రావ్, యువకులు పాల్గొన్నారు.

## పంటల నమోదు పకడ్బందీగా చేపట్టాలి



పార్డి(బీ)లో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో వివేక్

జైనథ్, ఫిబ్రవరి 9 : యాసంగిలో రైతులు వేసిన పంటలను పకడ్బందీగా నమోదు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి వివేక్ సూచించారు. శుక్రవారం పార్డి(బీ) గ్రామంలో రైతులు సాగు చేస్తున్న శనగ, జొన్న, పల్లి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పంటల నమోదు ఆధారంగానే రైతులు పండించిన పంటలు కొనుగోలు చేస్తారన్నారు. రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈవో ఆనంద్, రైతులు పాల్గొన్నారు.

## గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి



రికార్డులు పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి రామకృష్ణ

ఇచ్చోడ, ఫిబ్రవరి 9 : గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించి, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని కొండాపూర్, సుంకిడి ప్రత్యేకాధికారి, ఏడీ రామకృష్ణ అన్నారు. శుక్రవారం సిరికొండ మండలం సుంకిడి, కొండాపూర్ గ్రామ పంచాయతీల్లో రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. అనంతరం ఆయనను గ్రామస్తులు సన్మానించారు. కార్యక్రమంలో సుంకిడి, కొండాపూర్ కార్యదర్శులు అరుణ్, శ్రీనివాస్, మాజీ సర్పంచ్ అర్చన, గ్రామస్తులు పాల్గొన్నారు.



చేతిపంపు వద్ద తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు



పాఠశాలకు మినరల్ వాటర్ సరఫరా

## తాగునీటి కటకట

నార్నూర్‌లోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాలలో పక్షం రోజులుగా విద్యార్థులు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలో 200 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. నీటి సౌకర్యం లేక బావి, ఎంపీడీవో చేతిపంపు వద్ద భోజన సమయంలో, సాన్నాలకు వెళ్తున్నట్లు విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటి సౌకర్యం లేకపోవడంతో మినరల్ వాటర్ తెప్పిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయుడు ధర్మేందర్ తెలిపారు. పలు మార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని విద్యార్థులు, ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

-నార్నూర్, ఫిబ్రవరి 9

# కార్యకర్తలకు పరామర్శ

ఎదులాపురం, ఫిబ్రవరి 9 : అనారోగ్యంతో బాధపడుతున్న పలువురు బీఆర్‌ఎస్ కార్యకర్తలను శుక్రవారం మాజీమంత్రి జోగు రామన్న పరామర్శించారు. ఇటీవల బీఆర్‌ఎస్వీ జిల్లా అధ్యక్షుడు వాగ్మరే ప్రశాంత్ ప్రమాదవశాత్తు గాయపడి ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నాడు. అనారోగ్యంతో దవాఖానలో చికిత్స పొందుతున్న జాగృతి ప్రధాన కార్యదర్శి గోలి శంకర్‌ను పరామర్శించారు. మాజీమంత్రి వెంట నాయకులు బండారి సతీశ్, రంగినేని శ్రీనివాస్, రమేశ్, రాజేశ్, తదితరులు ఉన్నారు.



బీఆర్‌ఎస్వీ జిల్లా అధ్యక్షుడిని పరామర్శిస్తున్న మాజీమంత్రి జోగు రామన్న

# రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలి




విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఏఎంవీఐ ప్రదీప్‌కుమార్‌గౌడ్

బజార్‌హత్నూర్, ఫిబ్రవరి 9 : వాహనదారులు రోడ్డు భద్రతా నిబంధనలు తప్పక పాటించాలని ఏఎంవీఐ ప్రదీప్‌కుమార్‌గౌడ్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రత చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులకు, ఇరుగుపొరుగు వారితో పాటు వాహనదారులకు నిబంధనలపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. వాహనదారులు నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పెట్రోల్ బంకుల్లో నో హెల్మెట్ నో పెట్రోల్ నిబంధనలు కఠినతరం చేశామన్నారు. వాహనదారులు అన్ని రకాల ధ్రువపత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. అంతేకాకుండా ఆటోలో పరిమితిమించి ప్రయాణికులను ఎక్కించుకొని ప్రయాణం చేస్తే చర్యలు తప్పవన్నారు. చిన్న పిల్లలకు ద్విచక్ర వాహనాలు ఇవ్వవద్దని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరేశ్, వైద్యాధికారి భీంరావ్, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# విజ్ఞాన నిలయాలు గ్రంథాలయాలు

- కలెక్టర్ రాహుల్‌రాజ్
- రుయ్యాడిలో వివేకానంద గ్రంథాలయం ప్రారంభం



గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

తాంసి(తలమడుగు), ఫిబ్రవరి 9 : పల్లెల్లోని గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. శుక్రవారం తలమడుగు మండలం రుయ్యాడి గ్రామ పంచాయతీ భవన సముదాయంలో నూతనంగా ఏర్పాటు చేసిన వివేకానంద గ్రంథాలయాన్ని జడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రంథాలయాలు విద్యార్థుల భవిష్యత్‌కు, విజ్ఞానానికి నిలయాలని అన్నారు. గ్రామస్తుల సహకారంతో యువత గ్రంథాలయం ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. యువత గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకొని రానున్న పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలని సూచించారు. ముందుగా కలెక్టర్ మహాలక్ష్మీ, గృహజ్యోతి పథకం లబ్ధిదారుల వివరాల ప్రక్రియను పరిశీలించారు. ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్న వివరాలపై అధికారులకు సూచనలు జారీ చేశారు. ప్రజలు సరైన వివరాలు అందించి సర్వే బృందాలకు సహకరించాలని కోరారు. స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా గ్రామంలో పర్యటించారు. ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల, నర్సరీ, సెగ్రిగేషన్ షెడ్డు, పల్లె ప్రకృతి వనాలను పరిశీలించారు. ప్రత్యేకాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పర్యవేక్షణ చేపట్టాలని, గ్రామంలో నిరంతరం పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని, తడి పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి సెగ్రిగేషన్ షెడ్డుకు తరలించాలన్నారు. ప్రజలందరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, పంచాయతీ రాజ్ ఈఈ మహావీర్, డీపీఆర్‌వో విష్ణువర్ధన్, తహసీల్దార్ రాజ్‌మోహన్, ఎంపీడీవో రమాకాంత్, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీ ఫ్లెక్సీ దహనం



రాహుల్‌గాంధీ ఫ్లెక్సీని దహనం చేస్తున్న బీజేపీ ఓబీసీ మోర్చా నాయకులు

ఎదులాపురం, ఫిబ్రవరి 9 : ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఓబీసీ కాదంటూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు సరికాదని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు గోర్ల రాజుయాదవ్ అన్నారు. రాహుల్ గాంధీ వ్యాఖ్యలను ఖండిస్తూ శుక్రవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణచౌక్‌లో రాహుల్ గాంధీ ఫ్లెక్సీని దహనం చేశారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా కార్యదర్శి భూమేశ్, నాయకులు జోగు రవి, వేణుగోపాల్, సతీశ్ యాదవ్, నగేశ్, మహేందర్, వేణుగోపాల్, రవి, శేఖర్ పాల్గొన్నారు.

## 16న సమ్మెను విజయవంతం చేయండి

ఉట్నూర్, ఫిబ్రవరి 9 : ఈ నెల 16వ తేదీన దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న కార్మికుల గ్రామీణ భారత్ బంద్ సమ్మెను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్‌సింగ్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలోని రాంజీగోండ్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులు, రైతులపై ప్రభుత్వాలు వ్యవహరిస్తున్న తీరుకు వ్యతిరేకంగా సమ్మె నిర్వహిస్తున్నామని తెలిపారు. కనీస వేతనం రూ.26 వేలు, నాలుగు లేబర్ కోడ్స్ విద్యుత్ సవరణ అమలు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల వాటల అమ్మకం ప్రైవేట్ పరం చేయడం, రైతలుకు మద్దతు ధర ఇవ్వాలని, కాంట్రాక్ట్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు దూదేరావ్, ప్రజ్ఞాశీల్, వినోద్, సురేశ్, అశోక్, బుచ్చిరాం, జగపతి రావ్ పాల్గొన్నారు.

నార్నూర్, ఫిబ్రవరి 9 : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 16వ తేదీన దేశవ్యాప్తంగా కార్మికుల సమ్మె చేపట్టనున్నట్లు ఏఐటీయూసీ మండల కార్యదర్శి ఝాడే నాందేవ్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద సమ్మె పోస్టర్ విడుదల చేశారు. సమ్మెలో కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్మికులు సురేందర్, రాజన్న, కౌసల్యాబాయి, కిషన్, గోపాల్‌సిండే, శంకర్, ప్రకాశ్, శివాజీ, సునీల్ పాల్గొన్నారు.

## విద్యా కమిటీ చైర్మన్‌కు సన్మానం



విద్యా కమిటీ చైర్మన్‌ను సన్మానిస్తున్న ప్రధానోపాధ్యాయుడు హనుమాన్లు

బోథ్, ఫిబ్రవరి 9: మర్లపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మాజీ విద్యా కమిటీ చైర్మన్ ముదిగొండ గంగాధర్‌ను శుక్రవారం పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయుడు హనుమాన్లు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ గంగాధర్ నాలుగు సంవత్సరాలుగా పాఠశాల అభివృద్ధి కోసం చేసిన కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## హుండీ ఆదాయం లెక్కింపు

నార్నూర్, ఫిబ్రవరి 9 : మండల కేంద్రంలో 15 రోజులుగా వైభవంగా కొనసాగిన ఖాందేవ్ జాతర శుక్రవారంతో ముగిసింది. ఆలయ కమిటీ సభ్యులు హుండీ ఆదాయాన్ని లెక్కించారు. తైబజార్ రూ.1,29,500, హుండీ ఆదాయం రూ.74,222, మొత్తం రూ.2,03,722 ఆదాయం వచ్చినట్లు ఆలయ కమిటీ నిర్వాహకుడు తొడసం నాగోరావ్ తెలిపారు. కార్యక్రమంలో సోనేరావ్, ఆనంద్‌రావ్, గజేందర్, సోము పాల్గొన్నారు.

## గర్భిణులకు వైద్య పరీక్షలు

భీంపూర్, ఫిబ్రవరి 9 : కరంజి(టీ) వెల్‌నెస్ సెంటర్‌లో భీంపూర్ పీహెచ్‌సీ వైద్యాధికారి నిఖిల్‌రాజ్ ఆధ్వర్యంలో సిబ్బంది శుక్రవారం గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ శిబిరంలో హెచ్‌ఈవో లింగంపల్లి జ్ఞానేశ్వర్, సూపర్‌వైజర్ గంగాధర్, సిబ్బంది సుజాత, వివేక్, సంగీత, విమల, రేఖ, శశికళ పాల్గొన్నారు.

## ద్విచక్రవాహనం ఢీ కొని ఒకరు మృతి



గేడం గణపతి (ఫైల్)

ఉట్నూర్ రూరల్, ఫిబ్రవరి 9 : శ్యాంపూర్ గ్రామంలో ద్విచక్ర వాహనం ఢీ కొని ఒకరు మృతి చెందాడు. ఎస్ఐ మనోహర్ వివరాల ప్రకారం.. గేడం గణపతి(55) గురువారం రాత్రి మెడికల్ షాపుకు వెళ్లి మందులు తీసుకొని తిరిగి ఇంటికి వస్తుండగా వెనుక నుంచి గంగన్నపేట్ గ్రామానికి చెందిన న్యాతరి ప్రశాంత్ బైక్‌తో ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన గణపతిని స్థానిక ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స అందించి అనంతరం మెరుగైన చికిత్స కోసం ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు. రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య సీతాబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కూలి మృతి

బోథ్, ఫిబ్రవరి 9 : బోథ్ సమీపంలోని సాయినగర్ కాలనీలో పరుపుల దుకాణంలో పని చేస్తున్న షేక్ ఉమర్ (60) అనే కూలి శుక్రవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మృతి చెందాడు. ఇందుకు సంబంధించిన వివరాలు.. మహారాష్ట్రలో నాందేడ్‌కు చెందిన ఉమర్ హుస్సేన్ పరుపుల దుకాణంలో దినసరి కూలీగా పని చేస్తున్నాడు. రోజు మాదిరిగానే పరుపుల తయారి దూది పడుతుండగా మోటర్‌కు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో షాక్ గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం గమనించి యజమాని పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ రాము సంఘటనా స్థలాన్ని సందర్శించి శవ పంచనామా నిర్వహించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోథ్ దవాఖానకు తరలించారు.

## కొలాం సేవా సంఘం కార్యవర్గం

ఎదులాపురం, ఫిబ్రవరి 9: ఆదిమ గిరిజన కొలాం సేవా సంఘం ఆదిలాబాద్ రూరల్ మండల నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎనుకున్నారు. అధ్యక్షుడిగా టేకం ముత్త (బోరింగ్‌గూడ), ఉపాధ్యక్షుడిగా టేకం సంతోష్ (అంకాపూర్), ప్రధాన కార్యదర్శిగా సిడాం గంగారాం (డొండేరాగూడ), ప్రచార కార్యదర్శులుగా టేకం రావూజీ, టేకం సూరు, కోశాధికారిగా ఆత్రం బాలు(తిప్పగ్రామం), సాంస్కృతిక కార్యదర్శులుగా ఆత్రం లక్ష్మణ్, మాడావి లక్ష్మణ్, సలహాదారులుగా ఆత్రం దశరథ్, మాడావి లస్మను ఎన్నుకున్నారు.

## క్యాలెండర్ ఆవిష్కరణ

నార్నూర్, ఫిబ్రవరి 9 : మండలంలోని సైన్స్ మోడల్ బాలికల పాఠశాలలో తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం నాయకుల ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి విశ్వనాథ్, ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు జాదవ్ శివాజీ, రాథోడ్ హరిచంద్, హెచ్‌ఎం చౌహాన్ నెహ్రూ, ఉపాధ్యాయులు కైలాస్, పుష్పలత, రవీందర్, కల్పన, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థినులు ఎంపిక



జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

నేరడిగొండ, ఫిబ్రవరి 9 : మండలంలోని కేజీబీవీ విద్యార్థినులు సాఫ్ట్‌బాల్ పోటీలో జాతీయ స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ప్రత్యేకాధికారిణి రజిత తెలిపారు. 9వ తెలంగాణ జూనియర్ సాఫ్ట్‌బాల్ చాంపియన్ షిప్ బాలికల రాష్ట్ర స్థాయి పోటీలు ఇటీవల మెదక్ జిల్లా తూప్రాన్‌లో జరిగాయి. ఇందులో పాఠశాల విద్యార్థినులు ఆదిలాబాద్ జిల్లా తరపున ఆడి ద్వితీయ స్థానంలో నిలిచారు. విద్యార్థినులు వనిత, శిరీష, అలేఖ్య జాతీయ స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. వీరిని ప్రత్యేకాధికారిణితో పాటు ఉపాధ్యాయురాలు స్నేహ, కోచ్ రవి, వీడీసీ చైర్మన్ రవీందర్‌రెడ్డి అభినందించారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు మైనార్టీ గురుకుల విద్యార్థులు




రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 9 : ఆదిలాబాద్ రూరల్ మండలం చాందా మైనార్టీ గురుకులం బాలుర-1 పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. శుక్రవారం పాఠశాలల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వీరిని ప్రిన్సిపాల్ షేక్ ఆసిఫ్, పీఈటీ ముజాహిద్ అభినందించారు. షేక్ ఇమ్రాన్ (అథ్లెటిక్స్), సురేందర్ శ్రేయాన్ రెడ్డి (రగ్బీ), షేక్ అమీనుద్దీన్, (వెయిట్ లిఫ్టింగ్) పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు.

## ఉపాధి, జీవన నైపుణ్యాలపై అవగాహన




మాట్లాడుతున్న డాక్టర్ మధుసూదన్ రెడ్డి

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 9 : జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో కెరీర్ గైడెన్స్, ప్లేస్మెంట్ సెల్, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉపాధి, జీవన నైపుణ్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రముఖ మోటివేషనల్ స్పీకర్, లయన్ కెప్టెన్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి ముఖ్య వక్తగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా తమ జీవన, ఉపాధి నైపుణ్యాలను పెంపొందించుకొనే విధంగా తమ వ్యక్తిత్వాన్ని రూపొందించుకోవాల్సిన అవసరాన్ని ఉదాహరణపూర్వకంగా వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అచ్చి శ్రీనివాస్, కెరీర్ గైడెన్స్ కోఆర్డినేటర్ డాక్టర్ నర్సింగారావు, లయన్స్ క్లబ్ సభ్యులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అనాథ పిల్లలను ఆదుకోండి

- రెండేళ్ల క్రితం తల్లి, నిన్న తండ్రి మృతి




అనాథగా మారిన పిల్లలు

నార్నూర్, ఫిబ్రవరి 9 : గాదిగూడ మండలం దాబా(కే) గ్రామ పంచాయతీ పరిధిలోని పూనగూడకు చెందిన పెందోర్ పక్రు, రుక్మాబాయి దంపతుల మరణంతో నలుగురు పిల్లలు అనాథలయ్యారు. గ్రామ పెద్దలు తెలిపిన వివరాల ప్రకారం..ఈ దంపతులకు నలుగురు సంతానం. అందులో ముగ్గురు ఆడపిల్లలు, కొడకు ఉన్నారు. రెండేళ్ల క్రితం గర్భిణిగా ఉన్న రుక్మాబాయి ప్రసవ సమయంలో సరైన వైద్యం అందక మృతి చెందింది. పక్షం రోజులుగా తండ్రి పక్రు అనారోగ్యంతో బాధపడుతున్నాడు. శుక్రవారం పరిస్థితి విషమించి మృతి చెందాడు. తల్లిదండ్రుల మృతితో నలుగురు పిల్లలు అనాథలు కావడంతో గ్రామస్తులు కన్నీరుమున్నీరయ్యారు. ప్రస్తుతం పిల్లలను ఆదుకోవడం ప్రశ్నార్థకంగా మారింది. కన్న తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలు కంటతడి పెట్టుకుంటున్నారు. జ్యోతి 6వ తరగతి, జల్లుబాయి 4వ తరగతి, అనిత 2వ తరగతి (దివ్యాంగులు), దత్తు 1వ తరగతి చదువుకుంటున్నారు. పిల్లలను ప్రభుత్వపరంగా, దాతలు ముందుకు వచ్చి ఆర్థిక సాయం చేయాలని గ్రామపెద్దలు వేడుకుంటున్నారు.

## రైతు బీమా పథకంలో చేరాలి

ఉట్నూర్ రూరల్, ఫిబ్రవరి 9: రైతులు రైతు బీమా పథకంలో చేరాలని ఏఈవో సుధాకర్ సూచించారు. శుక్రవారం ఘన్‌పూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని చాప్రాల్‌లో రైతు ఆత్రం రాజు ఇటీవల మరణించగా అందుకు సంబందించిన ధ్రువపత్రాలు సేకరించి మాట్లాడారు. బీమా పథకంలో చేరిన రైతు మరణిస్తే బాధిత కుటుంబానికి రూ.5 లక్షల ఇన్సూరెన్స్ వస్తుందని చెప్పారు. రైతులు వ్యవసాయ శాఖ కార్యాలయంలో సంప్రదించి బీమా పథకంలో చేరాలని తెలిపారు. కార్యక్రమంలో కిసాన్ కోఆర్డినేటర్ కుమ్ర వినాయక్, తదితరులు ఉన్నారు.



బీమా పత్రాలు తీసుకుంటున్న ఏఈవో సుధాకర్